
సాక్షి
తూర్పుగోదావరి
గురువారం | 6 | జూలై | 2023



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి వనువులేటి సత్యనారాయణ(ఏలూరు) రూ.1,00,116 విరాళంగా బుధవారం సమర్పించారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 2,250, మధ్య డెల్టాకు 1,615, పశ్చిమ డెల్టాకు 4,240 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
31.5°/27.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	31.5	27.0
కాకినాడ	30.2	25.6
అమలాపురం	35.0	26.0

ఫ్యాక్ట్ చెక్..

- టిడ్కో ఇళ్లపై ఈనాడు 'పచ్చ'పాత రాతలు
- మౌలిక వసతులు లేవని నిందలు
- అవాస్తవాలతో దుష్ప్రచారం చేసే యత్నం
- విషపు రాతలపై లబ్ధిదారుల మండిపాటు
- 30 ఇళ్లకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
- 5 లక్షల నీటి నిల్వ సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంక్

బొమ్మూరులో నిర్మించిన టిడ్కో గృహాలు



ఇళ్లపై కళ్లకు గంతలు

సాక్షి, రాజమహేంద్రవరం: టిడ్కో గృహాలపై పచ్చ పత్రిక 'ఈనాడు' విష ప్రచారానికి తెర తీసింది. ఇళ్లను అన్ని వసతులు కల్పించి లబ్ధిదారులకు ఇస్తుంటే జీర్ణించుకోలేక తప్పుడు రాతలతో విషం కక్కుతోంది. అనుకున్నదే తడవుగా ఉన్నది లేనట్లు కట్టుకథలు అల్లింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పథకాలపై నిత్యం బురదజల్లడమే ధ్యేయంగా పెట్టుకున్న 'ఈనాడు' తన రాతలతో రోత పుట్టిస్తోంది. టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు లేవంటూ తాజాగా ఓ అసత్య కథనాన్ని ప్రచురించింది. కాలనీల్లో వసతులు స్పష్టంగా కనిపిస్తున్నా, ఇవేమీ పట్టించుకోకుండా కథనం ప్రచురించడంపై లబ్ధిదారులు చీదరించుకుంటున్నారు. క్షేత్ర స్థాయిలో 'సాక్షి' పరిస్థితులను పరిశీలిస్తే అందుకు భిన్నంగా ఉండటం విశేషం.

'తూర్పు'లో సుందరంగా టిడ్కో గృహాలు

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా రెండు దశల్లో 7,876 టిడ్కో గృహాలు మంజూరయ్యాయి. 72.13 ఎకరాల విస్తీర్ణంలో ఇళ్లు రూపుదిద్దుకున్నాయి. ఇందు కోసం రూ.486.38 కోట్లు వెచ్చిస్తున్నారు. భవన నిర్మాణానికి రూ.429.64 కోట్లు, మౌలిక వసతులకు రూ.40.14 కోట్లు, ఎస్టీపీ (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) పనులకు రూ.16.60 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మొదటి దశలో 4,200, రెండో దశలో 3,676 ఇళ్లు లబ్ధిదారులకు అప్పజెప్పేందుకు కసరత్తు ప్రారంభించారు.

మరో 2,880 ఇళ్ల పంపిణీకి సర్వం సిద్ధం

రెండో దశలో 2,880 ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. గృహాలు మంజూరుచేసిన ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేయడంతో పనులు వేగం పుంజుకున్నాయి. ప్రధానంగా తాగునీటి ట్యాంకుల నిర్మాణం, విద్యుత్, మురుగుకాలువలు, సీసీ రోడ్లు, అంతర్గత రోడ్లు, కల్వర్టులు తదితర అత్యవసర పనులను చేపడుతున్నారు. ఇప్పటికే సింహభాగం యూనిట్లలో పూర్తి చేయగా.. మిగిలిన వాటిలో యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. ఇంత అభివృద్ధి జరుగుతున్నా ఈనాడు కళ్లకు మాత్రం కనిపించడం లేదా? అన్న ప్రశ్న లబ్ధిదారుల్లో ఉత్పన్నమవుతోంది.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మురుగు వ్యవస్థకు డ్రెయినేజీలు ఏర్పాటు చేశారు. మురుగు నీరు వృథా అవకుండా ఎస్టీపీ నిర్మాణం చేపట్టారు. ప్రత్యేకంగా ఇనుముతో తయారు చేసిన డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశారు. అందులో చెత్త వేస్తే మున్సిపల్ సిబ్బంది తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేశారు.

ఫేజ్-2పై ఆరోపణలకు సమాధానం

లబ్ధిదారులకు అన్ని వసతులతో కూడిన గృహాలు అప్పగించాలన్నది ప్రభుత్వం నిర్ణయం అందుకు అనుగుణంగా ఫేజ్-2 గృహ సముదాయాల్లో పనులు ముమ్మరం చేసింది.

- తొర్రేడులో పనులు ఇప్పటికే పూర్తి కాగా.. మోరంపూడి 'డి' బ్లాక్, వడ్డెదార కాలనీల్లో మురుగు కాలువ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. రహదారి పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఇందుకు గాను రూ.15.56 కోట్లు వెచ్చిస్తున్నారు.
- ధవళేశ్వరంలో రూ.6.48 కోట్లతో, నామవరంలో రూ.3.03 కోట్లతో 100 మీటర్ల సీసీ రోడ్డు, 100 మీటర్ల మేర మురుగు కాలువలు నిర్మాణం తదితర పనులు పూర్తయ్యాయి. కల్వర్టు నిర్మాణం పురోగతిలో ఉంది. లేఅవుట్లలో ఎస్టీపీ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని సైతం త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

జిల్లాలో రెండో దశ గృహాల పంపిణీ ఇలా..

యూనిట్	300 (చ.అ.)	365 (చ.అ.)	430 (చ.అ.)	మొత్తం
మోరంపూడి-డిబ్లాక్	96	0	128	224
వడ్డెర కాలనీ	256	0	0	256
ధవళేశ్వరం	576	192	432	1,200
నామవరం	624	96	384	1,104
సింహాచలనగర్	96	0	0	96
మొత్తం	1,648	288	944	2,880

తొలి దశలో 3,424 ఇళ్లు అప్పగింత

జిల్లాలో తొలి విడతలో భాగంగా 3,424 టిడ్కో ఇళ్లను ప్రభుత్వం లబ్ధిదారులకు అప్పజెప్పింది. ఇందులో బొమ్మూరు-1 యూనిట్‌లో 2,528, తొర్రేడు యూనిట్‌లో 896 మంది గృహ ప్రవేశాలు చేసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో 1,824 ఇళ్లు 300 చదరపు అడుగుల విస్తీర్ణం, 672 గృహాలు 365 చదరపు అడుగులు, 928 ఇళ్లు 430 చదరపు అడుగులతో నిర్మాణం చేపట్టినవి ఉన్నాయి.



టీడీపీ తప్పిదాలను దిద్ది మరీ..

టీడీపీ ప్రభుత్వ హయాంలో అసంపూర్ణ పనులతో కాలం వెల్లదీశారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ వస్తుందటూ ఓటు బ్యాంకు కోసం పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పించకుండా హడావుడిగా గృహ ప్రవేశాలు చేయించేశారు. కొందరికైతే ప్లాట్లు అప్పజెప్పకుండా పట్టాలిచ్చి చేతులు దులుపుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి టిడ్కో గృహాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రిజిస్ట్రేషన్‌కు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించి ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేస్తోంది. ఇళ్ల పత్రాలు, తాళాలు గృహ సముదాయ ప్రాంగణాల్లోను అందజేస్తోంది.

ఈనాడు ప్రధాన ఆరోపణలు.. వాటికి సాక్ష్యాలు



ప్రతి 32 గృహాలకు ఒక ట్రాన్స్‌ఫార్మర్

ఆరోపణ : వీధి దీపాలు, పారిశుధ్య పనులు లేవు

వాస్తవం: బొమ్మూరులో నిర్మించిన టిడ్కో ఇళ్లల్లో అన్ని రకాల వసతులు కల్పించారు. 79 బ్లాకుల్లో 2,528 ఇళ్లు కేటాయించారు. అన్ని ఇళ్లల్లోనూ లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకుని ఆహ్లాదకర జీవనం సాగిస్తున్నారు. ఒక్కో బ్లాక్‌లో 32 ఇళ్లు ఉన్నాయి. ఓవర్ లోడ్‌తో విద్యుత్ కోతల్లో అంతరాయం కలగకుండా ఒక్కో బ్లాక్‌కు ప్రత్యేకంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టారు.



తాగునీటి ట్యాంకుల్లో నీటిని నింపుతున్న మున్సిపల్ సిబ్బంది

ఆరోపణ : తాగునీరు లేదు

వాస్తవం: బొమ్మూరు టిడ్కో గృహాలకు అవసరమైన నీరు సమృద్ధిగా ఉంది. 5 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ అందుబాటులో ఉంచారు. తద్వారా ప్రతి ఇంటికి నీటిని అందిస్తున్నారు. అంతేగాక తాగునీటి మున్సిపల్ ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నారు. ప్రతి బ్లాక్ వద్ద ఒక సింటెక్స్ ట్యాంక్ పెట్టి మరీ అందులో నీటిని నింపుతున్నారు. ఆ నీటిని ఆ గృహాల లబ్ధిదారులు తీసుకెళ్తున్నారు.



ఓవర్‌హెడ్ ట్యాంక్

ప్రశాంతంగా జీవిస్తున్నాం



లలితా నగరంలో నివాసం ఉండే వాళ్లం. మూడు నెలల క్రితం ఇక్కడికి వచ్చాం. పిల్లలు వేరే ప్రాంతాల్లో ఉంటున్నారు. నేను, మా ఆయన కోన ఈశ్వర్ ఇద్దరం ఇంట్లో ఉంటున్నాం. కాలనీలో తాగునీటి ఇబ్బందులు లేవు. అన్ని రకాల వసతులు సమకూర్చారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా హాయిగా జీవనం సాగిస్తున్నాం.

– కోన అనంతలక్ష్మి, బొమ్మూరు టిడ్కో హౌసింగ్ కాలనీ

సొంతింటి కల నెరవేరింది



మాది ధవళేశ్వరం. ప్రతి నెలా రూ.1500 అద్దె చెల్లించి అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. మూడు నెలల క్రితం ఇక్కడికి వచ్చాం. గృహ ప్రవేశం చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎప్పుడూ కరెంటు సమస్య రాలేదు. ప్రతి రోజూ ఉదయం తాగనీటి ట్యాంకు వచ్చి ఇక్కడున్న ట్యాంకులు నింపుతుంది. చెత్త వేసేందుకు చెత్త కుండీలు పెట్టారు. 24 గంటలు వాడుకునేందుకు నీరు ఇస్తున్నారు.

– కొవ్వూరు వెంకట రమణ, బొమ్మూరు టిడ్కో హౌసింగ్


న్యూస్‌రీల్

సీఎం జగన్ ఢిల్లీ పర్యటనపై కలవరమెందుకు : ఎంపీ భరత్



రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా ప్రతిపక్షాలు ఎందుకు కలవరపడుతున్నాయో అర్థం కావడం లేదని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే సీఎం జగన్ లక్ష్యమన్నారు. గతంలో సీఎం హోదాలో చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి ఏమి సాధించారో చెప్పగలరా అని టీడీపీ నాయకులను ప్రశ్నించారు. జగన్ ఢిల్లీ వెళ్లడం వల్లే పోలవరం మొదటి దశ నిధులు రూ.17 వేల కోట్లు వచ్చాయని, వెనుకబడిన ఏడు జిల్లాలకు రూ.22 వేల కోట్లు సాధించారన్నారు. గతంలో చంద్రబాబు కేంద్రం నుంచి కేవలం రూ.32 వేలు కోట్లు నిధులు సాధిస్తే, సీఎం జగన్ ఈ నాలుగేళ్లలో రూ.58 వేల కోట్లు తీసుకురాగలిగారన్నారు.

15న ఎత్తిపోతల పథకాల నుంచి నీరు విడుదల



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: పుష్కర, తొర్రిగడ్డ, చాగల్నాడు, కొత్త వెంకటనగరం ఎత్తిపోతల పథకాల ద్వారా ఈనెల 15వ తేదీన సాగునీరు విడుదల చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అడబాల చిన్నబాబు తెలిపారు. ప్రకాశం నగరంలోని కార్యాలయంలో రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో బుధవారం సాగునీటిశాఖ ఇంజినీర్లు, రైతు సంఘం నాయకులతో సమావేశమై నీరు విడుదల తేదీని ఖరారు చేశారు. ఈ సందర్భంగా అడబాల చిన్నబాబు మాట్లాడుతూ పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా రాజానగరం, జగ్గంపేట నియోజకవర్గాల రైతులకు; వెంకటనగరం, తొర్రిగడ్డ పథకాల ద్వారా రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాల రైతులకు; చాగల్నాడు ఎత్తిపోతల పథకం ద్వారా రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. సమావేశంలో పుష్కర ఎల్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రంగారావు, తొర్రి గడ్డ డీఈ ఆనంద్ బాబు, ఏఈ శివ ప్రసాద్, పుష్కర ఏఈ వినోద్, చాగల్నాడు ఏఈ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

90 రోజుల్లో అర్హులకు ఇళ్ల పట్టాలు

- జగనన్న కాలనీల్లో అన్ని వసతులు
- హోంమంత్రి తానేటి వనిత

కొవ్వూరు: దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదలందరికీ 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం ఇళ్ల పట్టాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి వనిత మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికే మూడు లేఅవుట్ల ద్వారా 3,278 మందికి ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇప్పుడు కొత్తగా దరఖాస్తు చేసుకున్న 97 మందికి ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయన్నారు. లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందిస్తున్నామన్నారు. అలాగే రూ.20 వేలు అడ్వాన్స్‌గా ఇస్తున్నామని తెలిపారు. డ్వాక్రా గ్రూపుల్లో ఉంటే ఇంటి నిర్మాణానికి రుణ సదుపాయం కూడా కల్పిస్తున్నారన్నారు. కొవ్వూరులో టిడ్కో ఇళ్లను అక్టోబర్, నవంబర్ నెలల్లో అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పట్టణంలో జగనన్న కాలనీల్లో ఇప్పటికే 730 మంది ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. అక్కడ తాగునీరు, రోడ్లు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకి మద్దతు ఇవ్వాలని కోరారు.



కొవ్వూరులో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న హోంమంత్రి తానేటి వనిత, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ

పేదల సొంతింటి కల సాకారం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను జగనన్న సాకారం చేస్తున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల సమస్యలన్నీ పరిష్కారమవుతున్నాయన్నారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ ఇళ్ల పట్టాలు తీసుకున్న లబ్ధిదారులందరూ త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, వైస్ చైర్ పర్సన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజలకు పారదర్శకంగా సేవలు

- కలెక్టర్ మాధవీలత
- ధ్రువీకరణ పత్రాల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటింటి సర్వే ద్వారా ప్రజలకు కావాల్సిన సేవలను గుర్తించి, అర్హత కలిగిన వారికి పారదర్శకంగా అందజేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. స్థానిక వీఎల్ పురంలోని 24, 25, 26 సచివాలయాలకు సంబంధించి బుధవారం నిర్వహించిన గ్రామ సభలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. 99 శాతం మంది ప్రభుత్వ పథకాలను అందుకుంటున్నారని, మిగిలిన ఒక్కశాతం అర్హులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో అవసరమైన కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రాలు 394, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 377 ఇతర సేవలు 30 అందించామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో 100 కుటుంబాలకు ఒక వలంటీర్ ద్వారా ప్రభుత్వం పౌర సేవలు అందిస్తోందన్నారు. కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ 24, 25, 26 సచివాలయాల పరిధిలో 1,832 ఇళ్లను సందర్శించి టోకెన్లు జారీ చేయడం ద్వారా 801 సేవలు అందించినట్లు తెలిపారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్, కమిషనర్ దినేష్ కుమార్

ఊ కొడతారా.. ఉలిక్కి పడతారా..!

- టీడీపీ బస్సు యాత్రపై మత్స్యకారుల ఆగ్రహం
- గతంలో గెలిచి వంచించారంటూ విమర్శలు
- జగన్ హయాంలో అభివృద్ధి చూసి బుద్ధి తెచ్చుకోవాలంటున్న గంగపుత్రులు



నాడు : టీడీపీ హయాంలో ఉప్పాడ హార్బర్ ప్రాంతంలో పరిస్థితి



నేడు : ఉప్పాడ హార్బర్ ప్రాంతంలో జోరుగా అభివృద్ధి పనులు

పిఠాపురం: అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్క పని చేయలేదు.. ఇప్పుడొచ్చి మీ భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తామంటే తామెలా నమ్మేదంటూ టీడీపీ నాయకులను మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. ఉప్పాడ హార్బర్ నిర్మిస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకుని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ..టీడీపీ అధినేత చంద్రబాబు గ్రాఫిక్స్ చూపించి నట్టేట ముంచారని దుయ్యబడుతున్నారు. భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో టీడీపీ నేతలు బస్సు యాత్రగా ఉప్పాడ రానున్న నేపథ్యంలో అప్పుడేం చేశారు..? ఇప్పుడేం చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు.సీఎం జగన్, స్థానిక ఎమ్మెల్యే దొరబాబు సారథ్యంలో జరిగిన ప్రగతి చూసి ఊ కొడతారా..ఉలిక్కి పడతారా అంటూ ఎద్దేవా చేస్తున్నారు.


టీడీపీ హయాంలో

2014లో ఉప్పాడ మత్స్యకారుల సమస్యలు తీరుస్తామని, మినీ హార్బర్ నిర్మిస్తామని చంద్రబాబుతో సహా టీడీపీ నేతలు హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తలేదు. రూ.50 కోట్లు కేటాయించామన్నారు. డీజిల్ సబ్సిడీ, వేట నిషేధం, ప్రమాదవశాత్తు మరణించిన పరిహారం పెంపు విషయాలను పక్కన పెట్టేశారు. ఉప్పాడ తీర ప్రాంతంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదు. పైగా తీరంలో డ్రెడ్జింగ్ పేరుతో రూ.2 కోట్ల ప్రభుత్వ సొమ్మును టీడీపీ నేతలు పంచేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

వైఎస్సార్ సీపీ హయాంలో

ప్రజా సంకల్పయాత్రలో భాగంగా కాకినాడలో నిర్వహించిన మత్స్యకార సమ్మేళనంలో విపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తానని మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే ఉప్పాడ తీరంలో మేజర్ హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 422 కోట్లు కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించారు. 2,500 బోట్లు నిలిపే సామర్థ్యంతో 1.10 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు మత్స్య సంపద సేకరించేలా దీనిని నిర్మిస్తున్నారు. 50 వేల మత్స్యకార కుటుంబాలకు ఇది ఆసరా కల్పిస్తుంది. కోల్డ్ స్టోరేజీలు, పెట్రోల్ బంకు, జెట్టీలు,ఫిష్ హ్యాండ్లింగ్, వేలం ప్రాంగణం, చేపలు ఎండబెట్టుకునే యార్డు, ప్యాకింగ్ షెడ్లు, మత్స్యకారులకు శిక్షణా కేంద్రం, వలలు అల్లుకునే షెడ్లు, ఐస్ ప్లాంట్ పనులు 50 శాతం పూర్తయ్యాయి. కరోనా ప్రభావంతో పనులు కొంత కాలం నిలిచిపోయినా తర్వాత ఊపందుకున్నాయి. ఆరు నెలల కాలంలో రూ.250 కోట్లకు పైగా వెచ్చించి సుమారు 60 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. డీజిల్ సబ్సిడీ రూ.6కు పెంచారు. వేట నిషేధ పరిహారం రూ 10 వేలకు పెంచారు. మత్స్యకారుల ప్రమాద పరిహారం కూడా రూ.10 లక్షలకు పెంచారు.


అప్పడేమీ చేయలేకపోయారు



టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే ఏమీ చేయలేకపోయారు. ఇప్పుడొచ్చి ఏం చేస్తారు. వారి మాటలు నమ్మే పరిస్థితి మత్స్యకార గ్రామాల్లో లేదు. కల్లబొల్లి కబుర్లతో నమ్మబలకాలని చూస్తే తిరుగుబాటు తప్పదు. మా నాయకులు చేసిన అభివృద్ధి మీరెప్పుడూ చేయలేకపోయారు. మత్స్యకార గ్రామాల్లో టీడీపీకి భవిష్యత్తు లేదని తేలిపోయింది. మా భవిష్యత్తు కోసం రానక్కర లేదు.

– నక్కా మణికంఠ, సర్పంచ్, మత్స్యకార నాయకుడు, అమీనాబాద


మేజర్ హార్బర్ నిర్మిస్తున్నారు



టీడీపీ ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క పనీ చేయలేదు. మత్స్యకారుల ఓట్లతో నెగ్గి వారిని నడిసంద్రంలో ముంచారు. వేట నిషేధ పరిహారం రూ.4 వేలు మాత్రమే ఇచ్చేవారు. అది కూడా టీడీపీ నేతల సిఫార్సులున్న వారికే ఇచ్చే వారు. డీజిల్ సబ్సిడీ పెంచలేదు. ముఖ్యమంత్రి జగన్ మాకు చెప్పిన దానికంటే ఎక్కువ చేశారు. మినీ హార్బర్ అడిగితే మేజర్ హార్బర్ నిర్మిస్తున్నారు.

– కారే శ్రీనివాసరావు, మత్స్యకార నాయకుడు, కోనపాపపేట

మీ భవిష్యత్తుకు గ్యారంటీ ఉందా..



14 ఏళ్ల టీడీపీ పాలనలో ఉప్పాడ తీర ప్రాంతానికి అన్యాయమే జరిగింది. ఇప్పుడు టీడీపీ నేతలు ఏ ముఖంతో మత్స్యకారుల దగ్గరకు వస్తారు. గత 50 ఏళ్లలో ఎప్పుడు లేని గ్యారంటీ జగన్ హయాంలో వచ్చింది. ఇక మీరు వచ్చి మాకు గ్యారంటీ ఏమి ఇస్తారు. అసలు మీకు భవిష్యత్తు ఉందో లేదో చూసుకోండి. ఇక్కడ వచ్చి మాకు గ్యారంటీ ఇవ్వాల్సిన అవసరం లేదు. తీర ప్రాంత అభివృద్ధి మత్స్యకారుల కళ్ల ముందే జరిగింది.

– ఉమ్మిడి జాన్, మత్స్యకార నాయకుడు, ఉప్పాడ

క్లుప్తంగా

రేపటి నుంచి టీటీ పోటీలు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక త్యాగరాజ నారాయణదాసు సేవాసమితి ఆడిటోరియంలో ఈనెల 7, 8, 9వ తేదీల్లో ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జేవీవీ అప్పారెడ్డి, వీటీవీ సుబ్బారావు ఈ విషయాన్ని బుధవారం తెలిపారు. అండర్ 11, 13, 15, 17, 19 బాలబాలికలు, స్త్రీ, పురుషుల విభాగాలలో జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని గుంటూరు, విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖపట్నం, అనకాపల్లి, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఒక చీఫ్ రిఫరీ, ఇద్దరు అసిస్టెంట్ రిఫరీలు, 20 మంది అంపైర్లు కలిసి 10 టేబుళ్లపై ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. 7వ తేదీ ఉదయం 9:30 గంటలకు ప్రారంభమై 9వ తేదీ సాయంత్రంతో ముగుస్తాయన్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు పతకాలు ప్రదానం చేస్తామని, విజేతలకు పాయింట్ల ఆధారంగా జాతీయ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

యువకుడిని రక్షించిన మత్స్యకారులు


ప్రసాద్‌కు సపర్యలు చేస్తున్న మత్స్యకారులు

అల్లవరం: మండలంలోని బెండమూర్లంక గ్రామానికి చెందిన యాళ్ల ప్రసాద్ బుధవారం బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి వైనతేయనదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వంతెనపై తన స్కూటీని నిలిపి, నదిలోకి దూకిన అతడిని చూసిన ప్రయాణికులు కేకలు వేశారు. దీంతో బ్రిడ్జి కింద చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు అప్రమత్తమై నదిలో మునిగిపోతున్న ప్రసాద్‌ను ఒడ్డుకి చేర్చి, 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడని భావిస్తున్నారు.

జంతుప్రేమికా.. జరభద్రం

- జంతువుల నుంచి మనుషులకు వ్యాధుల వ్యాప్తి
- మనుషుల నుంచి వాటికి కూడా..
- అప్రమత్తతే శ్రీరామరక్ష
- నేడు వరల్డ్ జూనోసిస్ డే


కాకినాడలోని ప్రభుత్వ వెటర్నరీ క్లినిక్‌లో కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

కాకినాడ క్రైం: మూగజీవాలంటే చాలామందికి అమితమైన ప్రేమ ఉంటుంది. ఉదయం లేచి దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకూ వాటితోనే గడుపుతుంటారు. అవి కూడా వారి కుటుంబంలో భాగంగా మారతాయి. అయితే జంతువుల లాలాజలం, తాకిడి, విసర్జకాల ద్వారా అనేక వ్యాధులు మనుషులకు సంక్రమిస్తాయి. వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడమే వరల్డ్ జూనోసిస్ డే ప్రధాన లక్ష్యం. రేబిస్‌కి వ్యాక్సిన్‌ను కనుగొన్న ప్రఖ్యాత జీవ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ మొట్టమొదటిసారి కుక్కకాటు బాధితుడికి వ్యాక్సిన్ వేసిన రోజును గుర్తు చేసుకుంటూ ప్రతి ఏడాదీ జూలై 6న వరల్డ్ జూనోసిస్‌డే నిర్వహిస్తున్నారు.

జూనోసిస్ అంటే...

జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే అసాధారణ ఆరోగ్య స్థితిని వైద్య పరిభాషలో జూనోసిస్ అంటారు. పెంపుడు జంతువులు, సంచార జీవుల నుంచి మనుషులకు అనేక వ్యాప్తి చెందుతాయి. వీటిని సంక్రమిత వ్యాధులు అంటారు. ఏ జంతువుల నుంచి ఏ వ్యాధులు సంక్రమిస్తామో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఏ.వెంకట రామయ్య వివరించారు.

- ఆవులు, గేదెల జాతుల నుంచి ఆంత్రాక్స్, రేబిస్, గాలికుంటు, క్షయ, తామర, మశూచి, క్యూఫీవర్, ఫైలేరియాసిస్ సంక్రమిస్తాయి.
- కుక్కలు, పిల్లుల నుంచి రేబిస్, కాట్‌స్క్రాచ్ ఫీవర్, తామర, టాక్సోప్లాస్మోసిస్, లార్వా మైగ్రాన్స్ వ్యాప్తి చెందుతాయి.
- ఎలుకల నుంచి ప్లేగు, లెప్టోస్పైరోసిస్ ఆశిస్తాయి.
- పందుల నుంచి మెదడు వాపు, గాలికుంటు, ఇన్‌ఫ్లూయంజా, బ్రూసెల్లోసిస్, లిస్టీరియోసిస్, సాల్మొనెల్లాసిస్, హైడాటిడోసిస్ వస్తాయి.
- గొర్రెలు, మేకల వల్ల రేబిస్, ఆంత్రాక్స్, హైడాటిడోసిస్, క్యూ ఫీవర్, ట్రిపన్ సోమియాసిస్ వ్యాప్తి చెందుతాయి.
- గుర్రాల నుంచి ఇన్‌ఫ్లూయంజా, రేబిస్, ఆంత్రాక్స్, తామర, గ్లాండర్స్, లిష్మేనియాసిస్ వ్యాప్తి చెందుతాయి.
- కోళ్లు, పక్షుల వల్ల ఇన్‌ఫ్లూయంజా, తామర, సిట్టకోసిస్, సాల్మొనెల్లోసిస్, లిస్టీరియోసిస్, క్లమీడియోసిస్ అనే వ్యాధులు ఆశిస్తాయి.

మనుషుల నుంచి జంతువులకు కూడా...

మనుషుల వల్ల మూగజీవాలకు కూడా హాని జరుగుతుందని వైద్య నిపుణులు వివరిస్తున్నారు. సుమారు 200 రకాల వ్యాధులు మనుషుల నుంచి మూగజీవాలకు వ్యాప్తి చెందుతాయని ప్రఖ్యాత సర్జన్ డాక్టర్ టీఎస్‌వీ అభిలాష్ తెలిపారు. ఈ స్థితిని వైద్య పరిభాషలో రివర్స్ జూనోటిక్ డిసీజ్ ట్రాన్స్‌మిషన్ అని, జూఅంత్రో పోనోసిస్ అంటారన్నారు. వ్యక్తుల నుంచి జంతువులకు వ్యాప్తి చెందే ప్రధానమైన వ్యాధి టీబీ అన్నారు. అలాగే చర్మవ్యాధులు, రేబిస్ వంటివి కూడా సంక్రమిస్తాయని తెలిపారు. హ్యూమన్ మెటాన్యూమో వైరస్ కూడా ఇదే విధానంలో వ్యక్తుల నుంచి జంతువులకు వ్యాప్తి చెందుతుందని వివరించారు.

అప్రమత్తత అవసరం

జూనోసిస్ రిస్క్ అధికంగా ఉన్న వర్గాలను వైద్యులు గుర్తించి జాగ్రత్తలు సూచిస్తున్నారు. గర్భిణులు, ఐదేళ్ల కంటే చిన్న, 65 ఏళ్ల కంటే పెద్దవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కీమోథెరపీ బాధితులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఎక్కువగా వ్యాధులు బారిన పడే అవకాశం ఉందన్నారు. జంతువులు కరవడం, గోళ్ల ద్వారా గాయం కావడం, వాటి తుంపర్ల ద్వారా, ఆహారాన్ని పంచుకోవడం, రోగాల బారిన పడిన జంతువులను తాకడం, చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న జంతువుల ద్వారా వ్యాధులు ఆశిస్తాయి.

జాగ్రత్తలు ఇవీ..

జూనోసిస్ సంక్రమిత వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు.

- పెంపుడు జంతువులకు తప్పకుండా టీకాలు వేయించి, నట్టల మందు తాగించాలి.
- ఏ జంతువుని తాకినా చేతులు కడుక్కొని శానిటైజర్ వాడాలి.
- జంతు కళేబరాలను లోతైన సున్నపు గుంతల్లో ఖననం చేయాలి.
- వారానికి ఒక్కసారైనా వాటికి స్నానం చేయించాలి.
- మరిగించిన పాలను మాత్రమే తాగించాలి. మాంసాన్ని పూర్తిగా ఉడికించి తినడానికి పెట్టాలి.
- చిలుకలు, పక్షులతో సన్నిహితంగా మెలగొద్దు.
- ఎలుకలతో జాగ్రత్తగా ఉండాలి

పూర్తయిన ఏర్పాట్లు



వరల్డ్ జూనోసిస్‌డే సందర్భంగా డీడీ కార్యాలయం ఆవరణలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వెయ్యి శునకాలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయనున్నాం. వైద్య,ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జంతు, అంటు వ్యాధుల వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. హెచ్ఐవీతో సహా ఎబోలా, స్వైన్‌ఫ్లూ, రింగ్ వార్మ్, హెపటైటిస్ ఈ, మలేరియా, ప్యారెట్ ఫీవర్, బర్డ్ ఫ్లూ, డెంగీ.. ఇవన్నీ జూనోసిస్ వ్యాధులే.

– డాక్టర్ కర్నీడి ఎస్‌వీవీఎస్ మూర్తి, జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఘాట్లలో 2 టన్నుల చెత్త తొలగింపు


పుష్కర ఘాట్‌లో చెత్తను ఎత్తుతున్న ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం అసెట్, నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడా –2023 ప్రచారంలో భాగంగా బుధవారం పుష్కర, మార్కండేయేశ్వర ఘాట్‌లలో పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించారు. నగర పాలకసంస్థ, ఓఎన్‌జీసీకి చెందిన దాదాపు 200 మంది ఉద్యోగులు, కలెక్టివ్‌లు, కుటుంబ సభ్యులు, హౌస్ కీపింగ్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని సుమారు 2 టన్నుల చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి 2014లో స్వచ్ఛత పక్వాడాను ప్రారంభించినప్పటి నుంచీ ఓఎన్‌జీసీ తరఫున అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. గోదావరిలో పెరిగిపోతున్న ప్లాస్టిక్ కాలుష్యంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి ప్లాస్టిక్‌ను రహితంగా, సహజంగా, పరిశుభ్రంగా ఉంచడానికి చేసే ప్రయత్నాలకు అన్నివేళలా మద్దతు ఇస్తామన్నారు. ఈనెల ఒకటిన ప్రారంభమైన స్వచ్ఛత పక్వాడా 15వ తేదీతో ముగుస్తుందన్నారు. ఇందులో భాగంగా పరిశుభ్రతపై డ్రైవ్, ప్రజలకు అవగాహన, పాఠశాలల విద్యార్థులకు క్విజ్ తదితర వాటిని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వినూత్న పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రి మృతి

కాట్రేనికోన: మండలంలోని పల్లంకుర్రు జైభీమ్ నగర్‌లో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న తాపీ మేస్త్రి నల్లం రామకృష్ణ (38) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కందికుప్పకు చెందిన రామకృష్ణ రోజూ మాదిరిగానే బుధవారం భవన నిర్మాణ పనికి వెళ్లాడు. ఇంటికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



వ్యక్తి ఆత్మహత్య

ధవళేశ్వరం: గ్రామ శివారు రాజీవ్ నగర్ కాలనీకి చెందిన సూరిమళ్ల మాణిక్యాలరావు (30) బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ధవళేశ్వరం పోలీసుల వివరాల ప్రకారం.. మాణిక్యాలరావు భార్య పైడితల్లితో కలిసి రాజీవ్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం వారిద్దరి మధ్య గొడవ జరిగింది. మాణిక్యాలరావు బుధవారం ఉదయం నిద్ర లేచిన అనంతరం టీ తాగాడు. స్వీపర్‌గా పనిచేస్తున్న పైడితల్లి పనికి వెళ్లింది. కొంతసేపటికి పైడితల్లికి బంధువులు ఫోన్ చేసి మాణిక్యాలరావు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడని, ఎంత పిలిచినా తీయడం లేదని చెప్పారు. దీంతో భార్య పైడితల్లి ఇంటికి వచ్చి తలుపులు తీయగా మాణిక్యాలరావు ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. కొన ఊపిరితో ఉన్న అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఏఎస్సై జి.వెంకటేశ్వర్లు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసుల్లో ముగ్గురికి జైలు

కపిలేశ్వరపురం: ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన 12 చోరీ కేసులకు సంబంధించి ముగ్గురు నిందితులకు రెండేళ్ల జైలు, రూ.2 వేలు చొప్పున జరిమానా చొప్పున విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి డాక్టర్ కె.దీప దైవకృప బుధవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. 2021 అక్టోబర్ 18న తన ఇంటిలో 152 గ్రాముల బంగారం, 1,750 గ్రాముల వెండి, రూ.30 వేలు చోరీకి గురయ్యాయని వెదురుమూడికి చెందిన యరమాటి రాజ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన చుండ్రు మురళీధర్ ఇంటిలో వెయ్యి గ్రాముల వెండి కంచం చోరీకి గురైందంటూ 2022 ఫిబ్రవరి 27న ఫిర్యాదు అందింది. అదేరోజు తన ఇంటిలో 1200 గ్రాముల వెండి వస్తువులు మాయమయ్యాయంటూ టేకి గ్రామానికి చెందిన బొప్పన దివ్య ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదులపై అప్పటి ఎస్సై బి.సంపత్ కుమార్ కేసులు నమోదు చేయగా సీఐ పి.శివగణేష్ విచారించారు. వాటితో పాటు మండపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో 1, రూరల్ స్టేషన్‌లో 2, ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో 6.. మొత్తం 12 కేసులు నమోదయ్యాయి. నేరం రుజువు కావడంతో ఆయా కేసుల్లో నిందితులైన భీమవరం సమీపంలోని పెద్దఅమిరం గ్రామానికి చెందిన తోటకూర రామకృష్ణంరాజు, నరసాపురం మండలం లక్ష్మేశ్వరం గ్రామానికి చెందిన సద్దుల కుమార్ రాజా, కర్ణాటకకు చెందిన విజయ్ తవరు పవార్‌లకు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. బాధితుల తరపున ఏపీపీ విళ్ల శ్రీరాములు వాదించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


శ్రీనివాసరావు మృతదేహం

కొవ్వూరు: పశివేదల బస్టాండ్‌లో ఈడుగుల శ్రీనివాసరావు (43) అనుమానాస్పదంగా మృతి చెందాడు. మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య సుజన పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావు గ్రామంలోని కోళ్లఫారంలో కూలీగా పనిచేస్తున్నాడు. అతడితో పాటు పనిచేసే అంజిబాబుకు ఇటీవల పెళ్లి కుదిర్చాడు. అయితే అంజిబాబుకి కాబోయే భార్య, ఆమె అక్కతో శ్రీనివాసరావు ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. దీనిపై అంజిబాబు గొడవ పడ్డాడు. పైగా అతడి ఇంటికి వెళ్లి కేకలు వేశాడు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం కొవ్వూరు వెళుతున్నానని శ్రీనివాసరావు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అనంతరం సుజనకు అంజిబాబు ఫోన్ చేయడంతో రాత్రి ఎనిమిది గంటలకు వస్తే తన భర్త ఉంటాడని చెప్పింది. అయితే శ్రీనివాసరావు ఇంటికి రాకపోవడంతో అంజిబాబుకి ఫోన్ చేసి అడిగితే రాత్రి 12 గంటలకు వస్తాడని బదులిచ్చాడు. కాగా.. బుధవారం తెల్లవారిన తర్వాత గ్రామానికి చెందిన కొవ్వూరి పోసియ్య వచ్చి శ్రీనివాసరావు పశివేదల బస్టాండ్‌లో ఉరి వేసుకుని ఉన్నట్లు చెప్పాడు. అయితే శ్రీనివాసరావు మోటారు సైకిల్, డబ్బులు, చెప్పులు, తాళాన్ని ఎవరో ఇంటి వద్ద పెట్టారు. కాగా.. సుజన ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ వైవీ రమణ, రూరల్ ఎస్సై జి.సతీష్, చాగల్లు ఎస్సై సీహెచ్ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌ను తీసుకు రాగా కోళ్ల ఫారం వైపు వెళ్లాయి. శ్రీనివాసరావు ఉరికి వేలాడుతూ ఉండడం, అతడి నోట్లో కర్చిఫ్ ఉండడంతో హత్యకు గురైనట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అతడికి గతంలో గ్రామానికి చెందిన ఒక వివాహిత మహిళతో సంబంధం ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ఈ కేసులో కీలక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. శ్రీనివాసరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

10న రాష్ట్ర స్థాయి వేద, స్మార్త పరీక్షలు

బోట్‌క్లబ్: వేదవిజ్ఞాన ప్రతిష్ఠానమ్ ఆధ్వర్యంలో చెరుకుపల్లి వేదిక్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 10న రాష్ట్ర స్థాయి వేద, స్మార్త పరీక్షలు రామారావుపేట వేదవిజ్ఞాన ప్రతిష్ఠానమ్‌లో జరుగుతాయని వేద విభాగం అధ్యక్షులు రాయప్రోలు ప్రసాద శర్మ బుధవారం తెలిపారు. శుక్ల, కృష్ణ యజుర్వేదాలు క్రమాంతము, రుగ్వేదం క్రమాంతము, సామవేదం, అథర్వణ వేదం పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకు రావాలన్నారు. 13 ఏళ్లుగా వేద పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 98495 07205 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

కోటసత్తెమ్మ హుండీ ఆదాయం రూ.27.11 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయ హుండీని బుధవారం తెరిచి లెక్కించారు. వంద రోజులకు హుండీలో రూ.27,11,436, అన్నదాన ట్రస్ట్ హుండీలో రూ.88,447, 21 గ్రాముల బంగారం, 230 గ్రాముల వెండి ఉన్నట్టు ఆలయ ఈఓ. బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు. దేవదాయశాఖ తాడేపల్లిగూడెం తనిఖీదారు ఎ.సుజన్ కుమార్ పర్యవేక్షణలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది నగదును లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక లారీ ఢీకొని మహిళ మృతి


సరోజిని (ఫైల్)

కె.గంగవరం: మండల పరిధిలోని కోట వద్ద ఇసుక లారీ ఢీకొని పితాపురపు సరోజిని (59) అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. ధవళేశ్వరానికి చెందిన సరోజిని తన కుమారుడితో కలిసి ఐ.పోలవరం మండల కేశనకూరు గ్రామంలో బంధువుల ఇంటికి మోటారుసైకిల్‌పై వెళ్లింది. తిరుగు ప్రయాణంలో యానాం మీద నుంచి ఏటిగట్టుపై ధవళేశ్వరం వస్తుండగా, కోటవద్ద గల జామతోట సమీపంలో యానాం వైపు వెళుతున్న ఇసుక లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెనక కూర్చున్న సరోజిని కిందపడిపోయింది. ఆమె తలపై నుంచి లారీ చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వీఆర్‌ఓ నాగేశ్వరరావు సమాచారం మేరకు సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నదీ ప్రాంతాలు షూటింగ్‌కు ఎంతో అనుకూలం


హీరో విశ్వక్ సేన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, గణేష్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలోని విశాల సాగర తీరంతో పాటు గోదావరి, కృష్ణా నదీ తీరాలు సినిమా షూటింగ్‌కు అనుకూలంగా ఉంటాయని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. రాజమహేంద్రవరం గోదావరి లంకల్లో హీరో విశ్వక్ సేన్ నటిస్తున్న సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఆ షూటింగ్ ప్రాంతాన్ని తన సోదరుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌తో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. హీరో విశ్వక్‌సేన్, సహనటులు హైపర్ ఆది, ప్రవీణ్ తదితరులతో ముచ్చటించారు. 90లలో రాజమహేంద్రవరం పరిసరాల నేపథ్యంలో జరిగిన కథతో రూపొందుతున్న వీఎస్11 (వర్కింగ్ టైటిల్) చిత్రానికి కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

24 కేజీల భారీ పండుగొప్ప



యానాం: మత్స్యకారుల వలకు బుధవారం ఉదయం భారీ పండుగొప్ప చేప చిక్కింది. స్థానిక గౌతమీ గోదావరి సంగమ ప్రాంతమైన భైరవపాలెం సముద్ర ప్రాంతంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు ఇది దొరికింది. దాని బరువు 24.70 కేజీలు ఉంది. దీనికి స్థానిక శివం బాత్ సమీపంలోని చేపలవేట నిర్వహణ స్థలంలో వేలం నిర్వహించగా మహిపాల చిన్న అనే వ్యక్తి రూ.17, 500 దక్కించుకున్నాడు. సాధారణంగా పదిహేను, పదికేజీల పండుగొప్ప చేపలు దొరుకుతుంటాయి. ఇలా ఇరవై నాలుగు కేజీల చేప దొరకడం చాలా అరుదని మత్స్యకారులు చెబుతున్నారు.

98.74 శాతం పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుకను జిల్లాలో బుధవారానికి 98.74 శాతం పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి తెలిపారు. జిల్లాలో 2,33,526 మంది లబ్ధిదారులకు రూ.64.38 కోట్లు మంజూరయ్యాయన్నారు. వారిలో 2,30,579 మందికి రూ.63.56 కోట్లు పంపిణీ చేశామన్నారు.